కథానిక

# శిక్షార్హులు

రచన: పెన్నశ్రీ

జమీందారు ముకుందరావు గారి వద్ద వున్న గుమాస్తాలందరిలోకి నీతి నియమాలు, గౌరవ మర్యాదలు, కలవాడు ఒక్కడు చలపతే. అతనంటే జమీందారు గారికి కూడా మంచి అభిమానము. మూడు సంవత్సరముల క్రితము గుమాస్తాగా చేరాడు చలపతి.

పదిహేను సంవత్సరముల క్రితం చలపతి కుటుంబమంతా రైలు ప్రమాదానికి గురి అయ్యారు. బ్రతికి బయట పడిన వారిలో, చలపతి మరియు రెండు సంవత్సరముల కూతురగు శారద. భార్య, కుమారుడు మరియు తల్లి గంగ పాలయ్యారు. తల్లి లేని పిల్లను ఆ కొరత లేకుండ అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసాడు చలపతి మళ్ళి పెళ్ళి చేసుకో లేదు. పది సంవత్సరములు దొర్లి పోయాయ్. దేశంలో పెద్ద కరువు వచ్చింది. తిండికీ గుడ్డకూ కరువై పోయింది. ఎంతోమంది స్వగ్రామాలు వదలి వలసపోయారు. వారిలో చలపతి కూడా ఒకడు. జీవితంలో చాల కష్ట నష్టాలకు గురియై గుండె రాయి చేసుకొని శారదను వెంటతీసుకొని దేశ ద్రిమ్మరిలా ఒక సంవత్సరముపాటు తిరిగి చివరకు ముకుందరావు వద్ద గుమాస్తాగా కుదిరాడు.

ఆ రోజు మొదటి తారీఖు. జమీందారు నెల జీతం నూరు రూపాయలను చలపతి చేతిలో పెట్టాడు. ప్రతినెలా జీతం చేతికందగానే బజారుకెళ్ళి కూతురుకు ప్రియమైన వస్తువు నొకదానినేదైనా కొనుక్కువెళ్ళేవాడు చలపతి ఆ నెలమధ్యలో సంక్రాంతి పండుగ అందుకని ఈసారి ఒక సిల్కుచీర రవిక గుడ్డలుకొనుక్కొని ఇంటిముఖం పట్టాడు చలపతి. సంక్రాంతి కానుకను త్వరగా కూతురుకి చూపించాలనే వుత్సాహంతో గబగబ ఇంటికి వెళ్ళి మూసియున్న తలుపును చూచి 'శారదా! శారదా!' అని పిలచాడు. లోపలినుంచి జవాబేమి రాకపోవుసరికి నిరాశ చెందాడు. బహుశ ప్రక్కింటికేగిందనుకున్నాడు ఆ తెచ్చిన బట్టలను పెట్టెలో పెట్టుటకని ప్రక్క గది తలుపు తెరిచాడు. ఎదురుగా దూలానికి నిర్జీవంగా వ్రేలాడుతున్న శారద శరీరాన్ని చూచి కెవ్వన కేకవేసి స్పృహతప్పి పడిపోయాడు. 'చలపతి,' అయిదు నిముషాలు గడచాక చలపతికి స్పృహ వచ్చింది. మెల్లగా కన్నులు తెరిచాడు. మరుక్షణమే ఎదురుగా మడచియున్న కాగితమొకటి కనపడింది. వణుకుతున్న చేతులతో ఆ కాగితాన్ని విప్పాడు.

నాన్నగారికి కడసారినమస్కారములు.

తల్లిలేని నన్ను చాల అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశావు నీ ఆశలన్ని నాపై బెట్టుకొని విషాదపూరితమైన గతాన్ని మరచిపోయావు. ఈ లోకాన్నుంచి దూరమై నీకు చాల ద్రోహం చేసాను. నిన్నొంటరివాడిగా చేసి పోయాను. నేను చేసిన చెడ్డపనికి నాకిదే శిక్ష. సజీవంగా చేసిన తప్పు పనిని నీతో చెప్పుకునే ముఖం లేకపోయింది.

ఒక సంవత్సరము క్రితము జమీందారు గారబ్బాయి వేణు నన్ను చూచాడు. అప్పటినుంచి నీవింట్లో లేని సమయాల్లో మనింటికి వస్తూండేవాడు. తియ్యటి కబుర్లు చెప్పేవాడు. కొద్ది రోజుల్లో మా స్నేహము ప్రణయముగా మారింది. వేణు నన్ను వివాహము చేసుకుంటానన్నాడు నేను నమ్మాను. అతనికి నా దేహం అంకితం చేసాను. దాని ఫలితము ఇప్పుడు తల్లి కాబోయే స్థితిలోకొచ్చాను ఆ సంగతి అతనితో చెప్పాను మరుసటి రోజునుంచి వేణు ఇక్కడ రావటము మానివేసాడు. అతని వివాహము మరొక అమ్మాయితో త్వరలో కాబోతున్నదని నాకు తెల్సింది. ఈ విషయమంతా నల్గురి నోట పడకముందే ఈ లోకాన్ని వదలిపోవటము వుత్తమమనిపించింది. ఇన్ని దినములనుంచి సంగనాచిలా సిగ్గుమాలిన పని చేసినందుకు కనీసం ఇప్పుడైనా క్షమిస్తావని ఆశిస్తున్నాను.

ఇట్లు.
శారద.

ఉత్తరము చూచి హృదయము పగిలేలా విలపించాడు చలపతి. వారం గడచింది అన్యమూ పుణ్యమూ ఎరుగని శారదను మోసపుచ్చి, ఆమె ప్రాణాలనుబలిగొన్న వేణుపై చలపతికి దిన దినంగడచినకొద్దీ ద్వేషం అధికం కాసాగింది. ఏలాగైనా బదులు తీర్చుకోవాలనుకున్నాడు. ప్రాణానికి ప్రాణం. అంతే చలపతి తీర్పు.

ఆ రోజు అమావాస్య. కన్ను పొడుచుకున్న ఏమీ కానరాకుండా వుంది. అర్ధరాత్రి వేళ వేణును తుద ముట్టించే ప్రయత్నముతో పదునైన

బాకు పొకదానిని తీసుకొని ముకుంద రావింట్లో అడుగుపెట్టాడు. అందరు గాఢ నిద్రలో మునిగితేలుతున్నారు. మూడు సంవత్సరములనుంచి అదేఇంట్లో పనిచేస్తుండటమువలన ఏకష్టము లేకుండ వేణు గదిలోకి ప్రవేశించాడు. తన ముద్దులకూతురు ప్రాణాలను బలిగొన్న వేణును తను తుదముట్టిస్తున్నానే అని తృప్తిపడ్డాడు. అతని ఆవేశం పురకలు పెట్టింది మరుక్షణమే ఆ పదునైనబాకు వేణు గుండెల్లో దిగింది. కేక వెయ్యకుండా మరొక చేతితో నోరు గట్టిగా మూసేసాడు చలపతి. మరొకపోటు. మరుక్షణమే వేణు, శారద చేరుకున్న లోకానికి చేరుకున్నాడు.

నెత్తురు కాల్వగట్టింది. చలపతికి భయం వేసింది తను చాల ఘోర కృత్యం చేశాననుకున్నాడు 'వేణును చంపినంత మాత్రాన తన శారద బ్రతికి వస్తుందా? పాపం! ముకుందరావుగారికి వేణు పెంపుడు కొడుకు తమ-ఆశలన్ని వానిపై పెట్టుకున్నారా దంపతులు. ఇంకో నెలరోజులలో వివాహముకూడా చేయాలనుకున్నారు. మూడు సంవత్సరములు ముకుందరావుగారి చలువవల్ల బ్రతికి ఈనాడు అతని కింత ద్రోహం చేశానే' అని వాపోయాడు చలపతి ఈ సంగతి తెల్లవారేసరికి నల్గురికీ తెలుస్తుంది. వేయికండ్లు కల పోలీసువారు తననెలాగయినా పట్టుకుంటారు. అదంతా జరుగకముందే తనావూరు విడచిపోవాలి. చాలా దూరం. మారువేషాలో తిరగాలి. మళ్ళీ దేహీ అంటూ నలుగురి ముందు చేయి చాచాలి! జరగబోయే దాన్నంతా తల్చుకొని హడలిపోయాడు చలపతి. చివరిసారిగా నిర్జీవంగా పడియున్న వేణు ముఖం చూడాలనిపించింది. వెంటనే టేబిల్ లైటు వెలిగించాడు. లైటు వెలిగిన మరుక్షణమే టేబిల్ పైన ఫోటో స్టాండులో అమర్చబడియున్న ఫోటోలు కన్పించాయి ఒక్కసారే చలపతి కండ్లకు చీకట్లు క్రమ్ముకున్నాయి. తనను తాను సంభాళించుకొని ఆ ఫోటోలన్నిటిని విడివిడిగా తీసి పరీక్షించసాగాడు.

మొత్తం పదిహేను ఫోటోలు. ఒక్కొక సంవత్సరం తేడాతో దిగినవి అవన్నీ వేణువి. ఇంతకూ వేణు........పదిహేను సంవత్సరముల క్రితం రైలు ప్రమాదానికి గురియైన తన కుమారుడే అని చలపతికి తెల్సింది.

'మూడు సంవత్సరాలనుంచి తన యింటిలో గుమాస్తాగా పనిచేసాడే కాని ఎన్నడూ వేణు గదిలోకి గాలేదు, వేణు, ముకుందరావుగారికి పెంపుడు కొడుకని ఎవరో చెపితే విన్నాడే కాని వేణు పుట్టు పూర్వోత్తరాలు తనెవరినీ అడుగలేదు.'

వేణు, శారదా అన్న చెల్లెళ్ళు.

ఒక్కసారే చలపతి వళ్ళు జలదరించింది జరిగిన అన్యాయాలకు లోలోన కుమిలి ఏడ్చాడు. శారద తను చేసిన తప్పు పనికి తనే శిక్ష విధించుకుంది. శారదకు చేయరాని ద్రోహంచేసిన వేణుకు తను శిక్ష విధించాడు. మిగిలినది తనొక్కడే, తనూ చేయరాని పాపం చేసాడు. కన్నకొడుకును చేతులారా హత్యచేశాడు. తనూ శిక్షార్హుడే! ఇంకేమి ఆలోచించలేక పోయాడు చలపతి మరుక్షణమే వేణు ముఖాన్నయినా కడసారి చూడకుండా అదే బాకును ..కొన్ని క్షణాల్లో భార్య, కూతురు, కుమారుడు చేరుకున్న లోకానికి వెళ్ళిపోయాడు చలపతి.

